క్లుప్తంగా

సీపీఆర్‌పై విద్యార్థులకు శిక్షణ



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

అడ్డతీగల: రోటరీ క్లబ్ కాకినాడ ఆధ్వర్యంలో అడ్డతీగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సీపీఆర్ (కాంప్రెషన్ ఓన్లీ లైఫ్ సపోర్ట్)పై ఆదివారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గుండె పనితీరుని సరిదిద్దే సీపీఆర్‌పై అవగాహన అవసరమని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వై.కళ్యాణ చక్రవర్తి అన్నారు.ఈ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో ప్రాణ రక్షణపై అవగాహన పెంచడమే రోటరీ క్లబ్ లక్ష్యం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లోనూ ఈ శిక్షణ కార్యక్రమాలను రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల్లో కూడా దీనిపై విశేషమైన స్పందన ఉందన్నారు. 9,10 తరగతులకు చెందిన 275 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులు శిక్షణ పొందారు.శిక్షణ పొందిన విద్యార్థులకు రోటరీ క్లబ్ ప్రతినిధులు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. రోటరీ క్లబ్ ప్రతినిధులు సత్యనారాయణ, కిరణ్, వరప్రసాద్, బాబీ, సీపీఆర్ ప్రోగ్రామ్ నిర్వాహకులు రామకృష్ణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం



సచివాలయ సిబ్బందిని సన్మానిస్తున్న స్థానికులు

గూడెంకొత్తవీది: మండలంలోని లక్కవరపుపేట సచివాలయం నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్తున్న సిబ్బందిని స్థానికులు ఆదివారం సన్మానించారు. ఉద్యోగంలో చేరిన నాటి నుంచి ప్రజా సమస్యల పరిష్కారంలో సచివాలయ సిబ్బంది విశేష సేవలందించారని స్థానికులు బోండ్ల చిరంజీవి, మచ్చల కళ్యాణ్, సుంకరి శ్రీను తదితరులు చెప్పారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చిన వెంటనే స్పందించే సిబ్బంది బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లడం బాధగా ఉందన్నారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. గ్రామస్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాతపాడేరులో కొరవడిన పారిశుధ్యం



పాత్త పాడేరులోని ఓ వీధిలో పేరుకుపోయిన చెత్త

పాడేరు రూరల్: పాత పాడేరులో పారిశుధ్యం కొరవడింది. వీధుల్లో ఎక్కడ చూసినా చెత్తచెదారాలు దర్శనమిస్తున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలతో పరిస్థితి మరింత దారుణంగా మారిందని స్థానికులు చెందుతున్నారు. తీవ్ర దుర్గంధంతో ఉండలేకపోతున్నామని, దోమలు విపరీతంగా పెరిగాయని కంటి మీద కునుకు ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోగాల ప్రబలే ప్రమాదముందని ఆందోళన చెందుతున్నారు. సమస్యను పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

వైభవంగా వెంకన్న ధ్వజస్తంభం ప్రతిష్ట



వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

దేవరాపల్లి: మారేపల్లి పాండవుల మెట్టపై వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు భారతానంద మహరాజ్, ఫణీంద్ర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు, గ్రామ ప్రజలు, పెద్దలు పాల్గొని ధ్వజ స్తంభం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ విశ్రాంత వీసీ ముర్రు ముత్యాలనాయుడు పాల్గొని వెంకన్న స్వామిని దర్శించుకున్నారు.

మోదమాంబ ఆలయానికి భక్తుల తాకిడి

మాడుగుల : ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయానికి శ్రావణ ఆదివారం సందర్భంగా భక్తుల తాకిడి పెరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కుంకుమ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఉచితంగా ప్రసాదాలు అందజేసింది.

ధరల దరువు



ముంచంగిపుట్టు సంతలో కూరగాయల అమ్మకాలు

- కొనలేం..తినలేం
- కొండెక్కిన కూరగాయల ధరలు
- విలవిల్లాడుతున్న కొనుగోలుదారులు
- మరింత పెరిగే అవకాశం ఉందంటున్న వ్యాపారులు



మార్కెట్‌లో విక్రయానికి సిద్ధంగా ఉన్న కూరగాయలు

ముంచంగిపుట్టు: మన్యంలో ఒకప్పుడు కూరగాయల సాగు ఎక్కువగా జరిగేది. అయితే సిండికేట్ వ్యాపారులు దందా వలన గిరిజన రైతులు తీవ్ర నష్టాలు ఎదుర్కోవడంతో సాగు విస్తీర్ణం తగ్గింది. వ్యాపారులంతా సిండికేట్‌గా నిర్ణయించిన ధరలకు కూరగాయలు, ఆకుకూరలను కొనుగోలు చేసేవారు. కనీసం రవాణా చార్జీలు కూడా రాక రైతులు ఇబ్బందులు పడేవారు. గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆర్థికంగా నష్టాలు ఎదుర్కొన్నారు. ఫలితంగా మండలంలో కూరగాయల సాగు గణనీయంగా తగ్గింది. వాణిజ్య పంటలైన పసుపు, మిరియాలు, చిరుధాన్యాల సాగుపై దృష్టి సారిస్తున్నారు. ఈ కారణాల వల్ల కూరగాయల ధరలు కొండెక్కాయి. ఉల్లి ఘాటెక్కింది..మిర్చి మంటపుట్టిస్తుంది..బహిరంగా మార్కెట్‌లో ఏ కూరగాయలు కొందామని చూసినా పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నాయి కొనుగోలుదారులకు బంగాళాదుంప నుంచి వంకాయ వరకు, బెండకాయ నుంచి బీరకాయ వరకు ధరలు భగ్గుమంటున్నాయి. ఏ కూరగాయ ధర అయినా కిలో రూ.60 నుంచి రూ.100ల వరకు ధర పలుకుతుంది. రూ.500 వందలు పట్టుకొని మార్కెట్‌కు వెళ్తే సంచి నిండని పరిస్థితి నెలకొందని సామాన్యులు వాపోతున్నారు. మన్యంలో కూరగాయల పంటలు అంతంత మాత్రం కావడంతో మన్యం వాసులకు కూరగాయలు మైదాన ప్రాంతమైన అనకాపల్లి, వి.మాడుగుల, చోడవరం తదితర ప్రాంతాల నుంచి రావాలి. దీంతో మైదాన ప్రాంతం నుంచి మన్యం ప్రాంతానికి వచ్చే సరికి ధరల్లో వ్యత్యాసం పెరిగిపోతుంది. ఇందులో భాగంగా కనీసం రూ.30 నుంచి రూ.50ల వరకు ప్రతి కాయగూర మీద అధికంగా అదనపు ధర పడుతుంది. చేతులు మారే కొద్దీ ధరల్లో వ్యత్యాసం పెరుగుతుండడంతో కొనుగోలుదారుల జేబులకు చిల్లు పడుతుంది. కూరగాయల ధరలు పెరగడంతో ఎలా కొనాలి...ఏం తినాలో సామాన్య గిరిజనం అల్లాడుతున్నారు.

ముంచంగిపుట్టులో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో
ఉల్లిపాయలు	రూ.40
టమాట	రూ.80
బంగాళదుంపలు	రూ.100
పచ్చిమిర్చి	రూ.180
బెండకాయలు	రూ.80
వంకాయలు	రూ.70
దొండకాయలు	రూ.60
బీన్స్	రూ.180
క్యారెట్	రూ.100
క్యాబేజి	రూ.80
కాకరకాయ	రూ.70

అధికారులు స్పందించాలి

కూరగాయల ధరలు చూస్తే ఏం కొనేటట్టు లేదు. మార్కెట్‌కు రూ.500 తీసుకెళ్లినా సంచి నిండటం లేదు.పెరుగుతున్న ధరలతో కుటుంబంపై ఆర్థికభారం పడుతుంది.ప్రస్తుతం ఉన్న ధరలతో సామాన్యుడు తకడం కష్టంగా మారింది. వారం వారం ధరలు పెరుగుతూ ఉండడంతో అవస్థలు పడుతున్నాము.అధికారులు స్పందించి, ధరలను నియంత్రించాలి.

– బి.నాగమణి, గృహిణి, ముంచంగిపుట్టు

నష్టపోతున్నాం

మైదాన ప్రాంతం నుంచి కూరగాయలు తీసుకువచ్చి విక్రయిస్తున్నాం.దీంతో ధరలు పెరుగుతున్నాయి. దీంతో పాటు కాయగూరల బుట్టలతో తెస్తుంటే అధికంగా కుళ్లిపోయి ఉంటున్నాయి. వ్యాపారం నష్టాలను కలిగిస్తుంది. కాని వ్యాపారం మానలేక పోతున్నం.

– పి.అప్పారావు, వ్యాపారి, ముంచంగిపుట్టు

రోడ్డు పనులు నిలిపివేతపై గ్రామస్తుల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

కొయ్యూరు: డౌనూరు పంచాయతీ ఉసరికిపాడు బీటీ రోడ్డును నెలలు గడుస్తున్నా పూర్తి చేయకపోవడంపై స్థానికులు ఆదివారం గ్రామంలో నిరసన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పాట్టిక పోతురాజు, సర్పంచ్ భవానీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు తదితరులు మాట్లాడుతూ కాంట్రాక్టర్ కొంతవరకు రహదారి నిర్మించి, అసంపూర్తిగా వదిలేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. రహదారి పూర్తి చేయాలని వారంతా ఆందోళన వ్యక్తం చేశారు. పెద్ద రాళ్లను పేల్చకుండా నిలిపివేయడంతో రాకపోకలకు ఇబ్బందులు వస్తున్నాయన్నారు. రెండున్నర సంవత్సరాల కిందట రూ.1.02కోట్ల నిధులతో మంజూరైన రహదారి ఇంత వరకు పూర్తి చేయలేదన్నారు. నిదులు దుర్వినియోగం చేశారన్న అనుమానం కలుగుతుందన్నారు. సమస్య పరిష్కారానికి త్వరలో కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం ఇస్తామని వారు చెప్పారు.

బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంపీపీ బోయిన కుమారి, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు గిరి ప్రసాద్, నాయకులు

గూడెంకొత్తవీధి: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహిస్తున్న బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని మండల పార్టీ అధ్యక్షుడు కంకిపాటి గిరిప్రసాద్, ఎంపీపీ బోయిన కుమారి కోరారు. వారు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ మండల కేంద్రంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు పాల్గొంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మోసాలను ఆయన వివరిస్తారన్నారు. కార్యక్రమానికి సర్పంచ్‌లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, కార్యకర్తలు, నాయకులు, అభిమానులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైస్ ఎంపీపీ లోతా దేముడు, పార్టీ ఉపాధ్యక్షులు వంతల అరుణ్‌కుమార్, రీమెల బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శులు వంతల చంటిబాబు, పాంగి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

6 న ఎల్లవరంలో 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ'

అడ్డతీగల: మండలంలోని ఎల్లవరంలో ఈనెల 6 న బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్సీ అనంత బాబు, రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నాగులపల్లి ధనలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.రంపచోడవరం నియోజకవర్గస్థాయిలో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించ తలపెట్టిన ఈ సమావేశానికి వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరుకావాలని కోరారు.

5న చలో విజయవాడ



రామకృష్ణ

గూడెంకొత్తవీది: ఏడు నెలల కిందట మంజూరైన నిధులను వెంటనే పంచాయతీలకు జమ చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 5న చేపట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని సర్పంచ్‌లు ఎక్కువ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు

కె.రామకృష్ణ కోరారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో పంచాయతీలకు కేంద్రం కేటాయించిన 15వ ఆర్థిక సంఘం నిధులు కోట్లాది రూపాయలను వెంటనే పంచాయతీలకు జమ చేయాలన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ దీనిపై వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. నిధుల మళ్లింపుతో సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు కనీసం నెలలు తరబడి గౌరవ వేతనం ఇవ్వలేని స్థితిలో ఉన్నారన్నారు. పంచాయతీలు కూడా నిధల కొరతతో సతమతమవుతున్నాయన్నారు. ఉపాధి హామీ పథకం పనులను పంచాయతీల ద్వారా చేపట్టాలని కోరారు.

హుకుంపేట: కేంద్రం ప్రభుత్వం ఏడు నెలల క్రితం పంచాయతీలకు విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను తక్షణమే గ్రామ పంచాయతీలకు విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 5న చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమానికి మండల సర్పంచ్‌లు తరలిరావాలని కొంతిలి సర్పంచ్ రేగం రమేష్ పిలుపునిచ్చారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అందించే 15వ ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు చేరకుండా రాష్ట్ర ప్రభుత్వం పక్కదారి పట్టిస్తుందని, దీన్ని నిరసిస్తూ మంగళవారం విజయవాడలో చేపట్టే ధర్నా కార్యక్రమానికి సర్పంచ్‌లంతా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

నిరుపయోగంగా ఏటీఎంలు

- ఖాతాదారుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



మూతబడి ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం

అరకులోయటౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రం, ఆంధ్రా ఊటి అరకులోయలో ఏటీఎం (ఆటోమెటిక్ టెల్లర్ మెషిన్)ల సమస్య వెంటాడుతోంది. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రమైన అరకులోయలో ప్రభుత్వ, ప్రయివేటు బ్యాంకులకు చెందిన 10కి పైగా ఏటీఎంలు ఉన్నాయి. వీటిలో నిత్యం సగానికి పైగా పనిచేయడంలేదు. మరికొన్ని ఏటీఎంలు అస్తవ్యస్తంగా దర్శనమిస్తున్నాయి, ఏటీఎంల నిర్వహణపై బ్యాంక్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. సకాలంలో నగదు తీసుకోవాలంటే పలు ఏటీఎంలకు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఇక్కడికి వచ్చే పర్యాటకుల నగదు కష్టాలు వర్ణనాతీతం. అరకులోయ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఉన్న రెండు ఏటీఎంలలో ఒకటి నిత్యం మూతబడి ఉంటుందని, మరోకటి శని, ఆదివారాల్లో ఏటీఎంలో క్యాష్ లేనట్టు చూపిస్తుంటుందని ఖాతాదారులు చెబుతున్నారు. డబ్బులు అవసరమైన వారు ప్రయివేటు ఆన్‌లైన్ సెంటర్‌ల వద్ద నగదు తీసుకునేందుకు రెండు శాతం చార్జీలు అదనంగా వసూలు చేస్తున్నారని పలువురు ఖాతాదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి ఏటీఎంలు సక్రమంగా నిర్వహించాలని, నగదు అందుబాటులో ఉంచాలని ఖాతాదారులు, స్థానికులు కోరుతున్నారు.

హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం

- గ్రామాల్లో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కి విశేష స్పందన
- వైఎస్సార్‌సీపీ పంచాయతీ కమిటీల నియామకం
- తరలివచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులు



బొండాం గ్రామంలో పంచాయతీ అధ్యక్షుడికి పత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ రోషిణి,



గన్నెలలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు రోషిణి, నాయకులు

అరకులోయటౌన్: ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా చేస్తున్న మోసాలను గిరి గ్రామాల్లోని ప్రతీ గడపకు వెళ్లి వివరించాలని అరకులోయ జెడ్పీటీసీ సభ్యురాలు శెట్టి రోషిణి అన్నారు. అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ నాయకుల ఆధ్వర్యంలో మండలంలోని బొండాం, గన్నెల పంచాయతీ కేంద్రంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యురాలు శెట్టి రోషిణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా చంద్రబాబు పాలన సాగిస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ హామీలను అటకెక్కించారన్నారు. తల్లికి వందనం కింద కుటుంబంలో పిల్లలందరికీ రూ. 15వేలు చొప్పున తల్లుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తానని ప్రకటనలు గుప్పించి, వాగ్దానాలు చేసి, ప్రస్తుతం లేనిపోని నిబంధనలు పెట్టి పథకానికి పంగనామం పెట్టారన్నారు. మహిళలకు ఉచిత బస్సు సర్వీసు, నిరుద్యోగ భృతి కోసం వారంతా ఎదురు చూస్తున్నారన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ స్త్రీకి నెలకు రూ.1500 గురించి ప్రస్తావనే లేదన్నారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు స్వాభి రామ్మూర్తి, ఉమ్మడి విశాఖ జిల్లా ఎస్టీ సెల్ మాజీ అధ్యక్షుడు కమిడి అశోక్ కుమార్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు పల్లాసింగి విజయ్ కుమార్, సర్పంచ్ దురియా భాస్కర్‌రావు, మాజీ సర్పంచ్ లైబోన్, ఎంపీటీసీ సభ్యులు లలిత కుమారి, శత్రుఘ్న, మండల పార్టీ కార్యదర్శి సొనియా తదితరులు పాల్గొన్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ పంచాయతీల కమిటీ నియామకం జరిగింది. ఇందులో బొండాం పంచాయతీ పార్టీ అధ్యక్షుడుడిగా పాంగి శంకర్‌రావు, కార్యదర్శులుగా గొల్లోరి డొంబు, దామోదర్‌రావు, రాజు, వంతాల నాగేశ్వరరావు, గన్నెల పంచాయతీ అధ్యక్షుడిగా శెట్టి మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శులుగా రాము, శెట్టి ఆనందరావు, గుండు, బారికి విజయ్ కుమార్, పంచాయతీకి నలుగురు చొప్పున కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దుంబ్రిగుడ: మండలంలోని అరకు మేజర్ పంచాయతీలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో జడ్పీటీసీ సీహెచ్.జానకమ్మ పర్యవేక్షణలో ఆదివారం బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పైబడినా సూపర్ సిక్స్ పథకాన్ని కనీసం అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగుతోందన్నారు. పథకాల పేరుతో ప్రజలకు కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను గ్రామస్తులకు పార్టీ నాయకులు వివరించారు. బాబు షూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం పోస్టర్‌ను విడుదల చేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.పరశురామ్, వైస్ ఎంపీపీలు శెట్టి ఆనంద్, పి.లలిత, మండల సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు కె.హరి, అరకు గుంటసీమ, కురిడి పంచాయతీల సర్పంచ్‌లు జి.శారద, గుమ్మ నాగేశ్వరరావు, లచ్చు, ఎంపీటీసీ వరహాలమ్మ, మాజీ ఎంపీటీసీ మహాదేవ్, మండల మహిళ అధ్యక్షురాలు బి శాంతి, ఉపాధ్యక్షుడు గణపతి పాల్గొన్నారు.



అరకులో మాట్లాడుతున్న జెడ్పీటీసీ జానకమ్మ, చిత్రంలో మండల పార్టీ అధ్యక్షుడు పరశురామ్

తిరోగమనంలో విద్యా రంగం



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్



సమావేశానికి హాజరైన విద్యార్థులు

అనకాపల్లి టౌన్: రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా రంగం తిరోగమనంలో ఉందని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ వెంకటేష్ విమర్శించారు. ఆదివారం స్థానిక దొడ్డి రామునాయుడు భవన్‌లో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఫీజు రీయింబర్సుమెంటు నేటికీ రాలేదన్నారు. విద్యార్థులు ఫీజులు కట్టలేదని కళాశాల యాజమాన్యాలు టీసీలు ఇవ్వడం లేదన్నారు. జిల్లా కేంద్రం అనకాపల్లిలో ఒక్క డిగ్రీ కళాశాల లేకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం హాస్టళ్లను దత్తత తీసుకోవాలన్న ఆలోచన వెంటనే విరమించుకోవాలన్నారు. తల్లికి వందనం ఇప్పటికీ చాలా మందికి రాలేదని వాపోయారు. దీనివల్ల అనేక మంది తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు కడుతున్నారన్నారు. ప్రభుత్వ విద్యను కార్పొరేట్ విద్యా సంస్థలకు కట్టబెట్టే ఆలోచనలో భాగంగా నూతన విద్యా విధానాన్ని తీసుకువస్తున్నారని విమర్శించారు. సమావేశంలో విజయ్, వెంకటలక్ష్మి, దివాకర్, కృపానంద తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్తెమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం

అనకాపల్లి: ప్రశాంతమైన వాతావరణంలో గ్రామ దేవతల ఉత్సవాలను నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక గవరపాలెం దాసరిగెడ్డ రహదారిలో సత్తెమ్మతల్లి ఆలయ 34వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ నెల 10న మధ్యాహ్నం 3 గంటలకు అమ్మవారి సారె ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, గవర కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ, జిల్లా వైద్య విభాగ అధ్యక్షుడు డాక్టర్ సిద్ధార్థ, ఆలయ గౌరవాధ్యక్షుడు వెంకటరమణ, అధ్యక్షుడు సీతారాం, కార్యదర్శి భీమేశ్వరరావు, కోశాధికారి వెంకయ్య నాయుడు, పార్టీ నియోజవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు రాజు, నాయకులు జ్ఞానదీప్, హైమావతి, శ్యామ్, రమణబాబు, చరణ్ పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ దేవతల ఒడ్డు పండగలు

మాడుగుల రూరల్ : గ్రామాల్లో గ్రామ దేవతలు ఒడ్డు పండగలు ఆదివారం నిర్వహించారు. మండలంలోని ఎం. కోడూరు, కె.జె.పురం, ఎం.కోటపాడు, సాగరం, తదితర గ్రామాల్లో మోదమాంబ, నూకాంబిక అమ్మవార్ల ఒడ్డు పండగలను ఘనంగా జరుపుకున్నారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి, భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఎం.కోడూరు గ్రామంలో గ్రామ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. కె.జె.పురంలో అమ్మవారిని ప్రత్యేకంగా ఆలంకరించారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

అనకాపల్లి టౌన్ : గోపాలపురం గ్రామంలో ఒక వ్యక్తి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో అదృశ్యం కేసు నమోదైంది. ఎస్‌ఐ రవికుమార్ తెలిపిన వివరాలివి. గొర్లి నాగేశ్వరావు(28) అనే వ్యక్తికి ఆరు నెలల క్రితం తీవ్రంగా కడుపు నొప్పి వస్తుండంతో పేగు సంబంధిత ఆపరేషన్ చేయించుకున్నాడు. అప్పటి నుంచి నొప్పి తగ్గలేదని ఇంటిలో ఎవరితోనూ సరిగా మాట్లాడక పోవడం, ఇంటిలో అయోమయంగా ఉండేవాడన్నారు. ఆదివారం ఇంటి నుంచి ఫోన్ తీసుకువెళ్లకుండా, వాహనంపై బయటకు వెళ్లి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

గంగాలమ్మతల్లి గుడికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

మునగపాక: పాటిపల్లి–మంగళవరపుపేట గ్రామాల సరిహద్దులో నిర్మిస్తున్న గంగాలమ్మ తల్లి గుడికి పలువురు భక్తులు విరాళాలు అందజేస్తున్నారు. ఆదివారం పాటిపల్లికి చెందిన సంజీవరావు, నాగమణి దంపతులు రూ.50,049 విరాళంగా అందజేశారు.

మండుతున్న ఎండలు..ఎండుతున్న నారుమళ్లు



శంకరంలో వరి నారుమడులు తడుపుతున్న రైతులు

మాడుగుల : జూలై, ఆగస్టు నెలల్లో వర్షాలు అధికంగా కురవాలి కాని వరుణుడు కరుణించకపోవడంతో వరినాట్లు వేయలేకపోతున్నారు. గత ఏడాది ఆగస్టు మొదటి వారంలోనే వరినాట్లు దాదాపు పూర్తి చేసుకున్నారు. ఈ ఏడాది ఆగస్టు వచ్చినా సరే వర్షాలు కురవక వరినార్లు కూడా ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చేస్తున్నారు. మండలంలో సాగరం, ఎం.కోడూరు, శంకరం, తాటిపర్తి, వీరవల్లి, కేజేపురం, పోతనపూడి, వీరనారాయణం, గ్రామాల్లో వరినాట్లు వ్యవసాయ మోటార్ల వద్ద వేస్తున్నారు. మండలంలో 12 వేల ఎకరాల్లో వరినాట్లు వేయాల్సి ఉండగా ప్రస్తుతం 1000 ఎకరాలు కూడా పూర్తి కాలేదని రైతులు చెబుతున్నారు. ఖరీఫ్ సీజన్ దాటిపోతుండడంతో ఈ ఏడాది ఇకపై వర్షాలు అనుకూలించినా సరే దిగుబడులు రావని రైతులు ఆవేదన చెందుతున్నారు. వరి నారుమడులు వేసి నెల దాటిపోతున్నా వర్షాలు అనుకూలించక ప్రస్తుతం ఎండిపోతుండడంతో రైతులు వ్యవసాయ బావి నుంచి వరి నారుమడులు తడుపుతున్నారు. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.